

సామాజిక, రాజకీయ, సినీ వారపత్రిక

# చరిత్ర

నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'



# నేనే ప్రధాన మంత్రిని అయితే!

సందేశ్ మీడియా వినూత్న ఆలోచనకు
వివిధ రంగాల ప్రజల స్పందన

**ప్రత్యేక సంచిక**

S tv SANDESH

ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

www.Sandeshtv.in

SANDESH PLUS

# ఎడిటోరియల్

సమాజంలో రక రకాల సమస్యలు ఉంటాయి. రోజువారీ జీవితంలో ఎన్నో ఆటు పోట్లు ఉంటాయి. ప్రజల కోసం ప్రభుత్వాలు రక రకాల పథకాలకు శ్రీకారం చుడతాయి. కొన్ని పథకాలు ప్రజలకు బాగా నచ్చుతాయి. మరి కొన్ని పథకాల్లో లోపాలు కనిపించవచ్చు. ప్రభుత్వాలు అనుసరిస్తోన్న విధానాలు మెజారిటీ ప్రజలకు నచ్చచ్చు. కొన్ని ఏమాత్రం నచ్చకపోవచ్చు. కొన్ని విధానాలను మారిస్తే బాగుండును అనిపించవచ్చు. తమకే అధికారం ఉంటే అలా చేసేయాలి..ఇలా చేసేయాలి అని ప్రతీ ఒక్కరికీ అనిపించవచ్చు. పూటకు ఠికానా లేని వారికి వ్యవస్థలో లోపాలు మరింత స్పష్టంగా కనపడతాయి. ఆ దురవస్థలను మార్చేయాలని వారికి అనిపించవచ్చు. అయితే వారి చేతుల్లో అధికారాలు ఉండవు కాబట్టి కేవలం ఆకాంక్షిస్తూ ఉండిపోతారు. ఓ సినిమాలో ఒక్కరోజు ముఖ్యమంత్రి పదవిని ఇస్తే తానుచాలా చేసేయగలనని కథానాయకుడు అనుకుంటాడు. అదే విధంగా 140 కోట్ల మంది జనాభాలో ప్రతీ ఒక్కరికీ ప్రధాన మంత్రి పదవిని అధిరోహించడానికి అర్హత ఉంది. కాకపోతే ఎన్నికల్లో గెలవాలి. అది అందరికీ సాధ్యం కాదు. ఈ నేపథ్యంలోనే మీరే ప్రధాన మంత్రి అయితే దేశానికి ఏం చేస్తారు? ఏ విధానాలు రూపొందిస్తారో చెప్పండంటూ సమాజంలోని వివిధ రంగాలకు చెందిన వారి అభిప్రాయాలను సేకరిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చింది. ఆ వెంటనే సందేశ్ మీడియా ప్రజల్లోకి వెళ్లింది. చాలా మందిని ఈ ప్రశ్నే అడిగాం. మీరు ప్రధాని అయితే ఏం చేస్తారు? అన్నాం. చాలా మంది మేము ప్రధాన మంత్రి కావడం ఏంటిఅని నవ్వి ఊరుకున్నారు. కొందరు చాలా సీరియస్ గా తీసుకున్నారు. ఊహలో అయినా ప్రధాని అయితే ఈ దేశం ఎలా ఉండాలని వారు కోరుకుం టున్నారో దాన్ని బయట

ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది




పెట్టారు. తమ ఆకాంక్షలు తమ విజనరీలను వివరించారు. చాలా మంది అద్భుతమైన ముందు చూపుతో స్పందించారు. ప్రతీ ఒక్కరూ దేశ హితానికి మంచి సూచనలు చేశారు. వినూత్న పథకాలు ప్రతిపాదించారు. అభిప్రాయాలు చెప్పిన వారిలో మెజారిటీ ప్రజలు మాత్రం ఒక్క విషయంలో ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ దేశం బాగుండాలంటే ముందుగా ప్రతీ ఒక్కరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించాలని ఎక్కువ మంది అన్నారు. ఈ రెండింటినీ అందిస్తే రాజకీయ పార్టీలు ఓట్లకోసం ఇచ్చే ఉచిత పథకాలు రద్దు చేసేయవచ్చునని వారు అభిప్రాయ పడ్డారు. దాదాపు అయిదు వందల మంది అభిప్రాయాలను సేకరించాం. వాటిలోనుంచి స్థలాభావం కారణంగా కొన్నింటిని మాత్రమే ఎంపిక చేశాం. వాటిని మీ ముందుంచుతున్నాం. మా ఈ ప్రయత్నం మీకు నచ్చుతుందని భావిస్తున్నాం.

**అనిల్ కుమార్ కుంట....**



నేనే కనుక ప్రధాన మంత్రిని అయితే భారత దేశాన్ని ఎవ్వరూ ఊహించని విధంగా ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తాను. మొక్కవోని పట్టుదల అకుంఠిత దీక్ష ఉంటే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని తెలంగాణా రాష్ట్ర సాధనతో నిరూపితం




# తెలంగాణా తరహాలో భారత దేశాన్ని అభివృద్ధి చేస్తా

## ముందు చూపుతో భావి భారతానికి రూపకల్పన చేస్తా

అయ్యింది సాధించుకున్న తెలంగాణాలో ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఇచ్చేందుకు మిషన్ కాకతీయ, భగీరథలతో పాటు మహిళామణులను లక్షాధికారులు చేసే పథకాలతో అక్కున చేర్చుకోగలిగాం. రైతు బంధు, దళిత బంధుతో అద్భుతాలు సాధించాం. నేను ప్రధాని అయితే తెలంగాణా మోడల్ ను దేశం మొత్తం మీద అమలు చేసి 140 కోట్ల మంది భారతీయులకు మేలు చేసే పథకాలకు రూపకల్పన చేస్తాను. అచ్చం తెలంగాణా మాదిరిగా భారత దేశం ఐటీ హబ్‌లా ఎదిగేలా విధానాలు రూపొందించి అమలు చేస్తాను. ప్రపంచ దేశాలు అసూయపడేలా మన భారతాన్ని తీర్చిదిద్దుతాను

**-శంభీపూర్ రాజు, ఎమ్మెల్సీ**





ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది
www.Sandeshtv.in

## నేను ప్రధాన మంత్రిని అయితే ప్రజాస్వామ్య పరిరక్షణకు,

# లౌకికవాద పరిరక్షణకు పెద్ద పీట వేస్తాను




ఎందుకంటే మనది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశం. మన మూలాల నుండే లౌకిక వాదాన్ని అంది పుచ్చుకుని వసుధైక కుటుంబక నినాదాన్ని ప్రపంచానికి అందించాం. అటువంటి మన దేశంలో కుల మతాలు, ప్రాంతాలు, భాషా బేదాలు లేకుండా అందరినీ కలుపుకుంటూ ముందుకు పోయేలా విధానాలు రూపొందిస్తాను. దేశంలో ప్రతీ ఒక్కరికీ నాణ్యమైన విద్య అందాలి. మెరుగైన వైద్య సదుపాయాలు అందాలి. దేశంలో రోజు రోజకీ పేదలు మరింత పేదలు అవుతున్నారు. ధనవంతులు మరింత ధనవంతులుగా ఎదుగుతున్నారు. ఈ ఇద్దరి మధ్య అంతరం ఏటా



పెరిగిపోతోంది. దీన్ని నియంత్రణలో ఉంచేలా విధానాలు రూపొందిస్తాను.రాజకీయాల్లో విష సంస్కృతి వచ్చింది. ప్రజాజీవితంలో లేకుండా.. ప్రజలకు ఎలాంటి సేవ చేయని వారు కూడా కోట్లకు పడగలెత్తితే చాలు ఎన్నికల బరిలో దిగి పదవులు అందుకుంటున్నారు. వారు ప్రజలకు ఏమీ చేయడం లేదు. ప్రజలకు ఏదో ఒకటి చేద్దామని నిజాయితీగా ప్రజాజీవితంలో అడుగు పెట్టిన మరి కొందరు తమ ఆస్తులను అమ్ముకుంటున్నారు. మంచి నేతలు ప్రజలకు అందుబాటులో ఉండే పరిస్థితులు లేకుండా ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి. దీని వల్లనే మంచి వాళ్లురాజకీయాలకు దూరం అవుతున్నారు. అటువంటి నేతలు రాజకీయాల్లో కొనసాగేలా ఏదైనా మంచి విధానాన్ని తీసుకు వస్తాను.దీనిపై దేశ వ్యాప్తంగా చర్చ కూడా జరగాలి.

**కొలన్ హనుమంత రెడ్డి,**
**కాంగ్రెస్ పార్టీ**
**సీనియర్ నేత**

# దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసే

# ఉచితాలను తీసేస్తా

## దేశం పట్ల ప్రతీ ఒక్కరికీ గౌరవం ఉండే వ్యవస్థ తెస్తా

దేశంలో చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో గెలవడం కోసం ఉచిత పథకాలు తెస్తున్నాయి. వాటి వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. అంతిమంగా దేశానికే నష్టం వాటిల్లుతుంది. అటువంటి ఉచితాలను నేను ప్రధాని కాగానే తీసేస్తాను. విద్య , వైద్యాలను అందరికీ అందుబాటులో తీసుకుని వస్తాను.



దేశ భద్రతకు, దేశంలో శాంతిభద్రతలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తాను.దేశంలో ప్రతీ పౌరుడూ కూడా ఇది నా భారత దేశం అని చెప్పి గర్వపడేలా దేశాన్ని తీర్చిదిద్దుతాను. దేశం పట్ల ప్రతీ ఒక్కరికీ గౌరవం ఉండాలి. జాతి పట్ల విశ్వాసం ఉండాలి. ఉచితాల ప్రవాహంలో కొట్టుకుపోతే ఏదో ఒక నాటికి దేశం కూడా ఉచితం అయిపోతుంది... అది ఎంతమాత్రం మంచిది కాదు. అందరూ దేశభక్తితో మెలగాలి. దేశంకోసం జీవించాలి.

-మోహన్ రెడ్డి,
బిజెపి సీనియర్ నాయకుడు

సామాజిక, రాజకీయ, సినీ వారపత్రిక
చరిత్ర
నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'

# కొలీజియం వ్యవస్థను

# సమూలంగా మార్చాలి




### ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థికీ ప్రాధాన్యత ఇవ్వాలి

నేను ప్రధాన మంత్రిని అయితే దేశంలో ఏ చట్ట సభలో అయినా సరే సభ్యుడిగా ఉండి పదవి అనుభవిస్తున్న వారు మరో చట్టసభలో సభ్యత్వం కోసం ఎన్నికల్లో పోటీ చేయాలంటే తాను ఉన్న పదవికి రాజీనామా చేసి తీరాలన్న నిబంధన తెస్తాను. అదే విధంగా ఒక నాయకుడు ఒక నియోజక వర్గం నుండే పోటీ చేయాలి. ఒకటికి మించి స్థానాల్లో పోటీకి అవకాశం లేకుండా చట్టం తెస్తాను. దేశంలో ప్రతీ ఒక్కరికీ కులమతాలకతీతంగా, ధనిక పేద అన్న తేడా లేకుండా విద్య, వైద్యాలను ఉచితంగా అందించే విధానాన్ని అమల్లోకి తీసుకు వస్తాను. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఉచిత హామీలు ఇవ్వడంపై నిషేధం విధిస్తాను. దేశంలో ప్రతీ ఆరు నెలలకీ ఎక్కడో ఒక చోట ఎన్నికలు ఉండడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుంది. అన్ని ఎన్నికలూ దేశ వ్యాప్తంగా ఒకేసారి జరిగేలా జమిలి ఎన్నికల వ్యవస్థ తెస్తాను. ఎన్నికల్లో గెలిచిన వారికి పదవులు వస్తున్నాయి. గెలిచిన వ్యక్తికన్నా కొద్ది పాటి ఓట్ల తేడాతో ఓడిపోయి రెండో స్థానంలో ఉన్నవారికి ఎలాంటి ప్రాధాన్యత లేదిపుడు. కానీ వారికి కూడా ప్రాధాన్యత నిచ్చేలా రాజ్యాంగ సవరణ తీసుకుని వస్తాను. న్యాయ వ్యవస్థలో ప్రస్తుతం ఉన్న కొలీజియం వ్యవస్థ లోపాలతో కూడుకుని ఉన్నది. ఎవరైతే న్యాయమూర్తులు ఉన్నారో వారి బంధువులు, మిత్రులే న్యాయమూర్తులు అవుతున్నారు. పేదలు, గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న వారు, బలహీన వర్గాల వారికి న్యాయమూర్తి పదవులు దక్కడం లేదు. ఈ వ్యవస్థ మారాలి. సరికొత్త పారదర్శక విధానాన్ని తీసుకు వస్తాను. ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనారిటీ , ఈబీసీ రిజర్వేషన్లలో ఆయా వర్గాల్లోని పేదలకు మొదటి ప్రాధాన్యత నివ్వాలి. వారికి అవకాశాలు ఇచ్చిన తర్వాత ఆ వర్గాల్లో సంపన్ను లకు ఇచ్చినా ఫర్వాలేదు కానీ ముందస్తు ప్రాధా న్యత మాత్రం పేదలకు దక్కేలా సవరణ తీసుకువస్తాను.



**మల్లారెడ్డి, బిజెపి**
**సీనియర్ నాయకుడు**


ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది
www.Sandeshtv.in

నాకే కనుక ప్రధాని అయ్యే అవ్వకాశం వస్తే మొట్ట మొదట నేను మహిళల రక్షణ పై ప్రత్యేక దృష్టి సారిస్తా. ఇంత వరకు చరిత్రలో లేని వినూత్న చట్టం తీసుకుని వస్తా. అమ్మాయిలను వేధించినా..అత్యాచారం చేసినా..హత్య చేసినా నిందితులతో పాటు సహనిందితులను శిక్షించేందుకు ఇప్పటికే చట్టాలు ఉన్నాయి. కాకపోతే నేరాలను అరికట్టాలంటే అవి సరిపోవు. ఈ చట్టాలతో సత్వర న్యాయం జరగడం లేదు. అబ్బాయిల కన్నా అమ్మాయిలే ఎక్కువ కష్టపడి పనిచేస్తారు..ఎక్కువ తెలివిగా వ్యవహరిస్తారు. అటువంటి అమ్మాయిలు బయటకు పోయి పనిచేయడానికి ఎందుకు జంకుతున్నారంటే వారిపై అకృత్యాలకు తెగబడే రాక్షసులకు భయపడే. మహిళలపై నేరానికి పాల్పడిన వారితో పాటు వారిని కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను కూడా శిక్షించేలా కొత్త చట్టం తెస్తా. తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు వచ్చేలా చేస్తా. అమ్మాయి బయటకు వెళ్తోంటే జాగ్రత్తగా వెళ్లి రామ్మా అని చెప్పి పంపిస్తాం. రేపు ఇది రివర్స్ కావాలి. అబ్బాయి బయటకు వెళ్తోంటే

## మహిళలపై అకృత్యాలు చేసే వారి

# తల్లిదండ్రులనీ శిక్షించే చట్టం తెస్తా



**నల్లధనం అన్నది లేకుండా ప్రతీ ఒక్కరూ పన్నులు కట్టే విధానం రూపొందిస్తా**

నాయనా జాగ్రత్తగా వెళ్లి రా.. ఎక్కడా ఎలాంటి అకృత్యాలు చేయకు..చేసి మమ్మల్ని బోనులో నిలబెట్టి మా పరువు తీయకు అని తల్లిదండ్రులు తమ కొడుకులకు చెప్పే పరిస్థితి రావాలి. అది తెస్తా. దేశాన్ని పట్టి పీడిస్తోన్న రెండో సమస్య నల్లడబ్బు. నల్లధనం కొందరి దగ్గరే మూలుగుతూ ఉండడం వల్లనే దేశం అభివృద్ధి చెందలేకపోతోంది. ప్రతీ ఒక్కరూ కచ్చితంగా పన్ను చెల్లించాలి. ఏటా లక్షలు పన్నులు చెల్లించే వారు రేపు వ్యాపారంలో నష్టపోతే ప్రభుత్వం మనల్నేమన్నా ఆదుకుంటుందా? అని ప్రశ్నించుకుంటున్నారు. అందుకే పన్నులు ఎగవేస్తున్నారు. అదే పన్నులు కచ్చితంగా కట్టే వారికి 50 నుండి 60 ఏళ్లు దాటిన తర్వాత పింఛన్ల తరహాలో ఆర్థికంగా సాయం అందించే చట్టం తెస్తా. అదే సమయంలో చాలా మంది బ్యాంకుల నుండి తక్కువ వడ్డీకి రుణాలు వచ్చే సదుపాయం ఉన్నా బయట రెండు మూడు రూపాయల వడ్డీకి అప్పులు తెచ్చుకుంటున్నారు. పన్నులు చెల్లించేవారికి తక్కువ వడ్డీకే రుణాలు అందించే విధానాన్ని రూపొందించి అమలు చేస్తా. ఈ రెండింటితోనే నా భారత దేశం ప్రగతి పథంలో పరుగులు పెడుతుందని నేను నమ్ముతున్నాను.

**జీవేందర్ రెడ్డి, బిజెపి నాయకుడు,**
**రియల్ ఎస్టేట్ వ్యాపారి**

సామాజిక, రాజకీయ, సినీ వారపత్రిక
చరిత్ర
నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'

దేశంలోనే వ్యవసాయానికి తెలంగాణాలో దక్కుతోన్న ప్రాధాన్యత ఇంకెక్కడా లేదన్నది వాస్తవం. నేను ప్రధాన మంత్రిని అయితే తెలంగాణా మాదిరిగా దేశ వ్యాప్తంగా వెన్నెముక అయిన రైతుకు రాజయోగం

కలుపుకుంటూ అనుసంధానం చేస్తే అన్ని ప్రాంతాలకు నీరు అంది పాడి పంటలతో

## రైతు రాజ్యాన్ని తెస్తాం..

# రైతునే రాజును చేస్తాం

పట్టేలా చేస్తాను.రైతు బంధు పథకంతో పాటు సంక్షేమ పథకాలను దేశ వ్యాప్తంగా అమలు చేస్తాను.కొన్ని రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాల్లో నదులు ఉన్నాయి. మరి కొన్ని చోట్ల నదులు లేవు. నదులు లేని ప్రాంతాలకు నీళ్లు అందుబాటులో ఉండవు. ఈ దుర్భిక్షాన్ని పోగొట్టాలంటే నదుల అనుసంధానం చేయాలి. నదులు, ఉపనదులను

**నదుల అనుసంధానంతో దేశాన్ని సస్యశ్యామలం చేస్తాం**

భారత దేశం వెలిగిపోతుంది.సాగునీటికి, తాగునీటికి లోటన్నదే ఉండదు.దేశమంతా సస్యశ్యామలం అయితే ఆహార భద్రతకు కొదవే ఉండదు. ఈ దిశగా బృహత్ ప్రాజెక్టులకు శ్రీకారం చుడతాను.



-శంభీపూర్ కృష్ణ

S tv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది
www.Sandeshtv.in

# కార్మిక,కర్షకులకు దేశమంతా చెల్లేలా స్మార్ట్ కార్డ్ ఇస్తాం

## ఏ రాష్ట్రానికి వెళ్లినా విద్య, వైద్యం ఉచితంగా అందేలా చూస్తాం

నేను ప్రధాన మంత్రిని అయితే దేశంలోని సంఘటిత అసంఘటిత రంగాల్లో ఉన్న కార్మికుల ప్రయోజనాలు పరిరక్షించే విధంగా పకడ్బందీగా ఒక చట్టం తెస్తాను. అదే విధంగా రైతు కూలీల జీవన ప్రమాణాలు పెంపొందించేలా నిర్ణయాలు తీసుకుంటాను. కార్మికులు, కర్షకులు ఏ రాష్ట్రానికి చెందిన వారైనా సరే వారు ఏ రాష్ట్రానికి వెళ్లినా సరే విద్య, వైద్యం ఉచితంగా అందించేలా ఒక స్మార్ట్ కార్డ్ రూపొందించి ఇస్తాం. విద్య, వైద్యాలను ప్రైవేటు రంగం నుండి తొలగించి పూర్తిగా ప్రభుత్వ అజమాయిషీలోనే ఉండేలా చేస్తాం. ఈ రెండూ సరిగ్గా ఉంటే చాలు దేశంలో ఏ సమస్యా ఉండదు.

**రంగారావు, కార్మిక నాయకులు**




# ఆరోగ్యశ్రీ వర్తించని రుగ్మతలకోసం కొత్త స్కీమ్ తెస్తా




అమ్మాయిల భద్రత కోసం సరికొత్త చట్టం రూపొందిస్తా

నేనే కనుక ప్రధాన మంత్రిని అయితే దేశంలోని 140 కోట్ల మందికి వైద్యాన్ని అందుబాటులోకి తెస్తాను. చాలా రుగ్మతలు ఆరోగ్యశ్రీలో కవర్ కావడం లేదు. అటువంటి రోగాలు కూడా వర్తించేలో ఏదైనా కొత్త స్కీమ్ తీసుకురావడానికి ప్రయత్నిస్తాను. వైద్యం అనేది బాగా ఖరీదైపోయింది. చాలా మంది దాన్ని భరించే స్థితిలో లేరు. కార్పొరేట్ వైద్యం చేయించుకునే స్థోమత లేక..చేతిలో చిల్లిగవ్వ లేక రోగాలతో ప్రాణాలు వదిలేస్తున్నారు. అలా ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా ఉండేలా మెరుగైన వైద్యాన్ని సామాన్యులు కూడా భరించగలిగే ధరల్లో అందించేందుకు విధానాలురూపొందిస్తా. అదే విధంగా రోజు రోజూ మహిళలపై వేధింపులు అరాచకాలు పెరిగిపోతున్నాయి. దానికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది. అమ్మాయిలపై ర్యాగింగ్ చేసినా.. ఆ ముసుగులో వేధించినా కఠిన శిక్షలు ఉండేలా కొత్త చట్టాన్ని తెస్తాను. అమ్మాయిలకు భద్రత కల్పిస్తాను.



**డాక్టర్ ప్రియాంక**
**హైదరాబాద్**

# పన్నుల విధానాన్ని సరళీకృతం చేయాలి

### ప్రతీ లావాదేవీపైనా తక్కువ పన్ను ఉంటే ఆదాయం అమాంతం పెరుగుతుంది

నేను ప్రధాని అయితే విద్య , వైద్యాలను ఉచితంగా అందిస్తాను. యువతను బాగా ప్రోత్సహించేలా విధానాలురూపొందిస్తాను. ప్రైవేటు రంగంలోనే విద్య, వైద్యాలు ఉన్నాయి. వీటిని ప్రభుత్వ రంగంలో అభివృద్ధి చేయిస్తాను. దీని వల్ల అందరికీ అందుబాటులో అన్నీ ఉంటాయి. ఇక పన్నుల విధానాన్ని సరళీకృతం చేస్తాను ఆదాయపన్నులో 20,30,40 శాతం స్లాబులను రద్దు చేస్తా. ప్రతీ లావాదేవీపైన అరశాతం పన్ను వేస్తే చాలు. ఎవ్వరూ పన్నులు ఎగ్గొట్టరు. ప్రస్తుతం ఈ స్లాబుల కారణంగా కోట్లాది మంది పన్నులు ఎగవేస్తున్నారు. తక్కువ పన్నులు ఉంటే ఇపుడొచ్చే పన్నుల ఆదాయానికి ఎన్నో వందల రెట్లు ఎక్కువ ఆదాయం వస్తుంది. 500,200 రూపాయల నోట్లు తీసేసి కేవలం వంద రూపాయల నోట్లు మాత్రమే ఉండేలా చేస్తా. దీని వల్ల అందరూ ప్రశాంతంగా ఉంటారు. ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. అభివృద్ధికి నిధులూ అందుబాటులో ఉంటాయి.






## శ్రీధర్ గుప్తా, వ్యాపారి



## సామాన్య, మధ్యతరగతి ప్రజలను కాల్చుకు తినే జీఎస్టీ తీసేస్తా

### బడా వ్యాపారులకే జి.ఎస్.టి.ని వర్తింపజేసేలా చట్టం తెస్తా

నేనే ప్రధాన మంత్రిని అయితే మొట్ట మొదట నేను తీసుకునే నిర్ణయం జి.ఎస్.టి. రద్దే. ఎందుకంటే జి.ఎస్.టి. వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. వెయ్యిరూపాయలు పెట్టి ఏదైనా కొంటే నాలుగు వందలు జీఎస్టీ లాగేస్తున్నారు. అలా చేస్తే మామూలు ప్రజలు ఎలా బతకాలి? మహిళలు వినియోగించే ప్రతీ వస్తువుపైనా. వారికి ఉపాధి కల్పించే కుట్టు మిషన్లు పార్లర్లు వంటి వాటిపై జి.ఎస్.టి. లేకుండా రద్దు చేస్తాను. ఒక కుటుంబంలో అంతా కలిసి రెస్టారెంట్ కి వెళ్లి నాలుగు వేలు పెట్టి తింటే 400 జీఎస్టీ అంటున్నారు. అందుకే మధ్యతరగతి ప్రజలు రెస్టారెంట్లకు వెళ్లడం మానేసి స్ట్రీట్ ఫుడ్ ని ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితి మారాలి. ఖరీదైన వస్తువులు, బడా వ్యాపారులకే జి.ఎస్.టి. పరిమితం చేస్తాను.



## రమణి, ఆశా వుమెన్ నెట్ వర్క్

# పాఠశాల విద్య ముగిసిన ప్రతీ ఒక్కరికీ సైనిక శిక్షణ ఇప్పిస్తా

## దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల్లో ఒకే సిలబస్ ఉండేలా చట్టం తెస్తా

నేను ప్రధాని అయితే దేశంలో చదువుకునే ప్రతీ ఒక్కరికీ సైనిక శిక్షణ ఇప్పిస్తాను. పాఠశాల విద్య ముగిసిన వెంటనే ఈ శిక్షణ ఉంటుంది. అదే విధంగా దేశ సరిహద్దుల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి రక్షణ కవచాన్ని ఏర్పాటు చేస్తాను. ఆర్మీ, నేవీలకు బడ్జెట్ లో అత్యధిక ప్రాధాన్యత ఇస్తాను. ప్రస్తుతం ఉన్న బడ్జెట్ ను మరింతగా పెంచుతాను. మైనారిటీలకు ప్రత్యేక హక్కులనేవి ఉండకుండా అందరితో సమానంగా వారికీ హక్కులు కల్పిస్తాం.పారిశుద్ధ్యం పరిశుభ్రతకు పెద్దపీట వేస్తా. వీధుల్లో చెత్త పారేసిన వారిపై కఠిన



చర్యలు తీసుకునే చట్టాలు తెస్తాం.నేర చరిత్ర ఉన్న వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు లేకుండా చట్టం తెస్తాం.మహిళా సాధికారికతకోసం పాటు పడతా. అత్యాచారాలు, మాదక ద్రవ్యాల స్మగ్లర్లకు మరణశిక్ష విధించేలా చట్ట సవరణ చేస్తాం

శ్యాం, ప్రవాస భారతీయుడు ( అమెరికా)

# అన్ని మతాల ప్రార్ధనా మందిరాల్లో ఉన్నత విద్యాబోధనకు చట్టం తెస్తా

## ప్రవాస భారతీయులను మాతృభూమికి రప్పించి పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తా

నేను ప్రధాన మంత్రిని అయితే వినూత్న సంస్కరణ తీసుకు వస్తాను. హిందూ, ముస్లిం, క్రైస్తవ, జైన, బౌద్ధ, సిక్కు మతాలకు చెందిన ప్రార్ధనా మందిరాల్లోనే ఉన్నత విద్యలో శిక్షణ ఇప్పించే సరికొత్త వ్యవస్థను ఏర్పాటు చేస్తాను. ప్రార్ధనా మందిరాల్లో విద్యా బోధన చేస్తే ప్రతీ ఒక్కరూ భక్తి ప్రపత్తులతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహిస్తాను. దేశం పట్ల కూడా వారికి భక్తి భావం ఉంటుంది. మంచి జీతాలకోసం ఉద్యోగాలకోసం వివిధ దేశాలకు తరలిపోయిన



భారతీయులను స్వదేశానికి రప్పించి వారికి అవసరమైన వసతులు, సదుపాయాలు కల్పించి ప్రోత్సాహకాలు అందిస్తాను. వారి ద్వారా పారిశ్రామిక ప్రగతికి తిరుగులేని బాటలు వేస్తాను. ఈ రెండు చర్యల వల్ల దేశం ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదుగుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అవసరం లేదు.

-నారాయణ దాసు చౌదరి, ప్రవాస భారతీయుడు( అమెరికా)

చరిత్ర
నిన్న జరిగింది నేటి 'చరిత్ర' -నేడు జరిగేది రేపటి 'చ
Stv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది
www.Sandeshtv.in

సామాజిక, రాజకీయ, సినీ వారపత్రిక
చరిత్ర
నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'

# దేశంలో ప్రతీ ఒక్కరికీ కూడు గూడు గుడ్డ అందిస్తా

## జై జవాన్ జై కిసాన్ కేవలం నినాదం కాదని నిరూపిస్తా

నేను ప్రధాన మంత్రిని అయితే 140 కోట్లమందిలో ఒక్కరు కూడా ఆకలితో అలమటించకుండా చూస్తా. ప్రతీ ఒక్కరికీ ఆకలి తీర్చుకోడానికి కూడు తలదాచుకోడానికి ఒక గూడు.. కట్టుకోడానికి గుడ్డ...అందినపుడే దేశం ఆరోగ్యంగా హాయిగా ఉన్నట్లు లెక్క. స్వతంత్రం వచ్చిన ఏడున్నర దశాబ్ధాలు దాటినా కోట్లాది మంది నిరుపేదల తలరాతలు మారలేదు. ఉన్న వాళ్లు మరింత ధనవంతులు అవుతున్నారు. పేద వాళ్లు మరింత గరీబోళ్లు అవుతున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు విధాన పరమైన నిర్ణయం తీసుకుంటాను. అస్సలుకే అభివృద్ధి చెందలేదని కాదు.. చాలా మంది అభివృద్ధి పథంలో అడుగు పెట్టారు. కానీ మన జనాభాతో పోలిస్తే అది చాలా తక్కువ . సరిపోదు. అందరూ ప్రగతి సాధిస్తేనే దేశం మెరుస్తుందని నేను నమ్ముతాను.ఇల్లు లేని పేద ఉండకూడదు. ఆకలితో ఒక్క పూట కూడా పస్తు ఉండకూడదు. ఉపాధి కోసం ఎవ్వరూ వెంపర్లాడాల్సిన పరిస్థితే ఉండకూడదు. అటువంటి అద్భుతమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తాను. జై జవాన్ జై కిసాన్ అన్నవి నినాదాలుగా మిగిలిపోతున్నాయి. రైతులు, సైనికులకు అన్ని విధాల అండగా ఉండే సమతుల్య విధానాలు అందిస్తాం. విద్య, వైద్యాలు అందరికీ ఉచితంగా అందిస్తాం. భారత దేశాన్ని ప్రపంచానికి ఆదర్శంగా తీర్చి దిద్దుతాను.



**కొలన్ శ్రీనివాసరెడ్డి,**
**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు**

# కోడిగుడ్డు కూడా కొనలేని పేదలు కోట్లల్లో ఉన్నారు

## విద్య, వైద్యాలకే ప్రజలు ఆస్తులు అమ్ముకుని దివాళా తీస్తున్నారు

కుల, మతాలు, ప్రాంతాలు, ధనిక పేద అన్న తేడా లేకుండా దేశంలో ఎవ్వరైనా ప్రధాన మంత్రి అయ్యే అద్భుత ప్రజాస్వామ్యం భారత దేశం సొంతం. అయితే మన దేశంలో 140 కోట్లమంది జనాభా ఉంటే అందులో 10శాతం మంది కన్నా తక్కువగానే సంపన్నులు ఉన్నారు. మిగతా 90 శాతం మంది పేదరికంలో మగ్గుతున్నారు.నేను ప్రధాన మంత్రిని అయితే దేశమంతా విద్య, వైద్యాలను ఉచితంగా అందిస్తాను. ఆ రెండూ అందితే ప్రజలు ప్రభుత్వాల నుండి ఇంకేమీ కోరుకోరు. వారి జీవితాలను అద్భుతంగా తీర్చిదిద్దుకోగలరు.






చదువుకోసం, వైద్యం కోసం లక్షల్లో అప్పులు చేసి ఆ అప్పులు తీర్చలేక నరకయాతన పడుతోన్న వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. ఈ రెండింటినీ ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని నేను భావిస్తాను. బెంజి కార్లలో తిరిగే కొద్ది మంది విలాస జీవితాలు గడుపుతున్నారు. మెజారిటీ ప్రజలు ఆటోలు, రిక్షాలు, నడుపుకుంటూ పొట్ట పోసుకుంటున్నారు. పిల్లల్ని చదివించాలంటే తల్లిదండ్రులు భయపడిపోయే పరిస్థితి ఉంది. అది పోవాలి. ఆసుపత్రికి వెళ్లడం కన్నా రోగంతో చనిపోవడమే బెటరనుకుంటున్నారు. ఆ దుస్థితీ పోవాలి. ఆ దిశగా సరికొత్త వ్యవస్థకు శ్రీకారం చుడతాను. దేశాన్ని అక్షరాస్యతలో అగ్రగామిని చేస్తాను. మౌలిక సదుపాయాలు, మంచి రహదారులు,రవాణా సదుపాయాలు అందుబాటులోకి తెస్తాను. మొత్తం మీద దేశాన్ని నెంబర్ వన్ గా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తాను

-అస్కాని మారుతీ సాగర్
సీనియర్ జర్నలిస్ట్

S tv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది
www.Sandeshtv.in

# అఖండ భారతాన్ని సాధిస్తా




## ప్రపంచాన్ని శాసించే స్థాయికి భారత్‌ను తీసుకెళ్తా

నేనే ప్రధాని అయితే మన పూర్వ విద్యావ్యవస్థను ఒక పథకం ప్రకారం పాశ్చాత్యులు భ్రష్టు పట్టించిన మెకాలే విద్యావిధానానికి పాడె కడతాను. మన పూర్వ విద్యావ్యవస్థతో పాటు ప్రాచీన సాంస్కృతిక జీవన విధానానికి పట్టం కడతాను. భారతీయుల శౌర్య ప్రతాపాలు, పోరాట పటిమలకు సాన పట్టి కాల క్రమంలో ముక్కలుగా విడిపోయిన భారత భూభాగాలన్నింటినీ కలుపుకుంటూ అఖండ భారతాన్ని సాధిస్తాను. ఇజ్రాయెల్ లో యూదులను అక్కడి పాలస్తీనీయులు తరిమేస్తే ప్రపంచ దేశాల్లో ఉన్న యూదులంతా ఇజ్రాయెల్ వచ్చి తమ అస్తిత్వాన్ని చాటుకోడానికి ఎలా స్ఫూర్తి దాయకంగా పోరాడారో దాన్ని మన భారత యువత ఆదర్శంగా తీసుకునేలా కార్యక్రమాలు చేపడతాను. ప్రపంచంలో భారత దేశంలోనే యువత ఎక్కువ. ఈ యువ శక్తితో భారత దేశం త్వరలోనే ప్రపంచాన్ని శాసిస్తుంది. ఆ స్థాయికి దేశాన్ని నడిపిస్తాను.



**-తిలక్, యువజన నాయకుడు**


Stv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది
www.Sandeshtv.in

# ఉచిత పథకాలు తీసేస్తా

## విద్యారంగంలో అన్ని రకాల ఫీజులూ నియంత్రిస్తా

నేను ప్రధాని అయితే దేశ వ్యాప్తంగా విద్య, వైద్య రంగాలను అందరికీ అందుబాటులో ఉండేలా నియంత్రిస్తాను. విద్యారంగంలో నర్సరీ కే లక్ష రూపాయలు ఫీజు వసూలు చేస్తూ దోచేస్తున్నారు. నర్సరీ నుండి పీజీ వరకు ఫీజులు మాత్రం కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండేలా విధానాన్ని తీసుకుని వస్తాను. ఎంత ఎక్కువ మంది మంచి చదువులు చదివితే దేశం అంత వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఇక రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడం కోసం ఇస్తోన్న ఉచిత పథకాలను తీసేస్తాను. దివ్యాంగులకు ఉచితంగా ఇస్తే తప్పులేదు కానీ ప్రతీ ఒక్కరికీ ఉచితం అనడం కరెక్ట్ కాదు. ఇక రిజర్వేషన్ల విషయంలోనూ కఠిన నిర్ణయం తీసుకోవాలి ప్రస్తుతం రిజర్వేషన్లు తీసుకున్న వారే తీసుకుంటున్నారు.. ఓసీ లు ఎంత చదివినా వారు అర్హతలు సాధించలేక




నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఈ సమస్య పోవాలంటే రిజర్వేషన్లు తీసేయాల్సిందే. దేశంలో ప్రతీ ఒక్కరూ విద్య, వైద్యాలపైనే ఎక్కువగా ఖర్చు చేస్తున్నారు. అప్పుల పాలవుతున్నారు. ఈ రెండింటినీ నియంత్రిస్తే అన్ని సమస్యలూ కొలిక్కి వస్తాయని భావిస్తున్నాను. ఇక పారిశ్రామికంగా పురోగతి సాధించాలంటే చిన్న పరిశ్రమలు పెట్టుకోవాలని ముందుకు వచ్చే వారికి వారిలో ఎంత ప్రతిభ ఉన్నా రుణాలు ఇవ్వడం లేదు. ఏదో ఒకటి కుదువ బెట్టందే అప్పులు దొరకడం లేదు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, ఎం.ఎస్.ఎం.ఇ. లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, రాయితీలతో పాటు వారికి అవసరమైన రుణాలు సరళంగా అందించేలా చూస్తాను. అపుడే దేశం ప్రగతి పథంలో పరుగులు పెడుతుందని నా విశ్వాసం.



**కృష్ణ కిషోర్,**
**పారిశ్రామిక వేత్త**

సామాజిక, రాజకీయ, సినీ వారపత్రిక

చరిత్ర

నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'

S tv

SANDESH

ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

# అనిల్ కుమార్ కుంట.... ✍

## సందేశ్ మీడియా...

## 93933 44405